# నూరేళ్ళపంట

కథా నిలయం
శ్రీకాకుళం

రామారావుగారి ఇల్లు రణరంగంలా ఉంది.

తల్లీ కూతుళ్ళిద్దరూ తారస్థాయిలో వాదించుకుంటున్నారు. వాళ్ల వాగ్వివాదానికి కారణమైన ఉత్తరం రామారావుగారి చేతిలో ఉంది. ఆయన దాన్ని నెమ్మదిగా చదువుతున్నారు.

"గతంలో మీరు మీ అమ్మాయిని మా అబ్బాయికిచ్చే విషయం ప్రస్తావించారు. మా అబ్బాయి వచ్చే బుధవారం బయలుదేరి విశాఖపట్నం వస్తున్నాడు. వచ్చినపుడు మీ ఇంటికి వస్తాడు. మిగతా వాళ్ళం మేమెవరమూ రావడం లేదు. పెళ్లిచూపులంటే ఒక పెద్ద గుంపు రావడం అలాగే పెళ్లి కుమార్తె తాలూకు స్నేహితులు బంధువులు చాలామంది తయారవడం, అతి మర్యాదలు "నీకు వంటొచ్చా" వంటి పనికిరాని ప్రశ్నలతో చివరికి అమ్మాయి, అబ్బాయి ఒకరికొకరు పూర్తి పరిచయం కూడా కాకపోవడం అబ్బాయికి ఇష్టం లేదు. అందుకే ఒక్కడే వస్తున్నాడు. మీ ఇంట్లో ఒక నాలుగైదు గంటలు గడపాలని అతని ఊహ. ఈ పద్ధతి మీకు సమ్మతమైన పక్షంలో మీరెవరైనా వచ్చి ఏరోజు సాయంత్రమైనా మీ ఇంటికి తీసుకెళ్లండి. అతనికి మీ ఇల్లు తెలియదు కదా! మా స్నేహితులింట్లో దిగుతున్నాడు. అడ్రసు కింద రాస్తున్నాను."

ఉత్తరంలో సారాంశం తెలిశాక రామారావుగారు తలెత్తేరు. ఆయనకు ఇందులో గొడవకు కారణం తెలియలేదు. అదే మాట అర్ధాంగిని అడిగేరు. పద్మావతమ్మగారు "అబ్బాయి సాయంత్రం వచ్చి మనింట్లో నాలుగైదు గంటలుంటాడంటే రాత్రి భోజనం ఇక్కడే చేస్తాడు కదా. వంట నేను చేసి సునీతి చేసిందని చెప్తానంటున్నాను" అంది.

రామారావుగారికి సమస్య అర్థమయింది. ఒక్కర్తే కూతురవడంవల్ల అమ్మాయిని అపురూపంగా పెంచింది వాళ్లమ్మ, చదువుకుంటోందని కొన్నాళ్ళూ, ఉద్యోగం చేసి అలసిపోతుందని ఇప్పుడూ అసలు వంటింట్లోకి రానిచ్చేది కాదు. దానితో సునీతికి వంట సరిగ్గా రాదు. పెళ్లిచూపులకొచ్చిన ప్రతిఒక్కరూ "వంటొచ్చా" అని అడగడమూ, ఏదో ఒక మధ్యస్థ సమాధానం చెప్పబోయేలోగానే సునీతి "రాదు" అని చెప్పెయ్యడమూ మామూలైపోయింది. ఈ సమాధానం ఎంతవరకూ కారణమో కానీ ఇంతవరకూ ఒక పెళ్లి చూపులూ ఫలించలేదు. ఈ సారి అబ్బాయి ఇక్కడ భోజనం కూడా చేస్తున్నాడు. భార్య బాధ అర్థమయింది ఆయనకు.

"పెళ్లి కొడుకు గారు నా గురించి పూర్తిగా తెల్సుకుందుకు కదా మనింట్లో అంతసేపుండేది. అందుకే వంట నేనే చేస్తాను. నా వంట నచ్చితే చేసుకుంటాడు

లేకపోతే లేదు. అంతగా వంటలక్కే కావాలనుకుంటే ఎవరేం చేస్తారు" అంది సునీతి. ఆమె ఆంధ్రా బ్యాంకులో ఆఫీసరు.

"అబ్బాయి చదువుతో పాటుగా కాటరింగ్ టెక్నాలజీలో ఏదో చిన్న డిప్లొమా కూడా చేశాట్ట. అతనికి వంట బాగా వచ్చునట. అలాంటివాడు మన సునీతి వంటను ఎలా మెచ్చుకుంటాడు?"

"ఈ వివరాలు నీకెలా తెలిశాయి?"

"ఉందిగా మీ మరదలు ఒక పెద్ద వార్తా సంస్థ. వివరాలన్నీ ఆవిడే సేకరించింది. పెళ్లి కొడుకు వాళ్ల సునందను కూడా చూడ్డానికి వస్తున్నాడు. సునంద ఎంత బాగా వంట చేస్తుందో"

"నువ్వు నేర్పించి ఉంటే నేనూ అంతకన్నా బాగానే చేసేదాన్ని"

"సరే ఇప్పుడా గొడవెందుకు? అతన్ని పిలిచిన రోజున నేను వంట చేస్తాను. మా అమ్మాయి చేసింది అని చెప్తాను. ఇందులో నాకేం తప్పుకనబడ్డం లేదు.

"నా పేరు సునీతి. నేను నీతికి నిలబడతాను. అబద్ధాలాడ్డానికి ఒప్పుకోను".

"ఆ రూల్సు అన్నమానం వర్తించవు. వెయ్యి అబద్ధాలాడైనా ఒక పెళ్లి జరిపించమన్నారు. మా చెల్లెలి కూతురికి వయస్సు తక్కువ చెప్పి పెళ్లి చేశారు. మనమేం అలాంటి అబద్ధాలాడుతున్నామా?".

"అలా పెళ్లిళ్లు చేసే అమ్మాయి జీవితాలు నాశనం చేస్తున్నారు. ముందు అడిగిన కట్నానికి తల ఊపేసి తర్వాత మాట తప్పితే జరిగే దహనాలు రోజూ పేపర్లలో చదువుతూనే ఉన్నాం. కట్నం ఆశించడం తప్పే. మాట తప్పడం మాత్రం తప్పుకాదా? మీ చెల్లెలి కూతురు బతుకెలా ఉందో చూస్తూనే ఉన్నాం కదా. పదిపైసలు కూడా అతను బీరువాలో తాళం వేసే ఉంచుకుంటాడని నీ దగ్గర చెప్పుకుని ఏడుస్తుంది. ఎదుటి మనిషికి మనమీద నమ్మకం కలిగేలా ఉండాలి మన ప్రవర్తన.

నేను బాగా వంట చేస్తానని నన్ను పెళ్లి చేసుకుంటే రేపటినుంచి నావంటెలా తింటాడతను? నన్ను నమ్మి, ఎవరినైనా భోజనానికి పిలిస్తే ఎంత నగుబాటు? పెళ్లికి పునాదులు పరస్పర అవగాహన, ఒకరిమీద ఒకరికి నమ్మకం. అందుకని నేనే వంట చేస్తాను. నచ్చితేనే చేసుకుంటాడు. లేకపోతే లేదు".

"అమ్మాయి చెప్పింది సబబుగానే ఉంది". అన్నారు రామారావుగారు.

"మీకు సబబుగానే ఉంటుంది. రేపు ఆ అబ్బాయి సునందను చేసుకున్నా మీకు

సంతోషంగానే ఉంటుంది. మీ తమ్ముడి కూతురు కదా" రామారావుగారు ఆవిడతో వాదించదల్చుకోలేదు.

"అమ్మాయ్, నీ ఇష్టప్రకారమే కానియ్యి. ఎప్పుడు పిలుద్దాం" అన్నారు.

"శనివారం మాకు హాఫ్‌డే కదా ఆరోజు పిలవండి. మర్నాడు రెస్ట్ తీసుకుందుకు ఉంటుంది. ఎటొచ్చీ అమ్మకి సినిమా చూడ్డానికి ఉండదేమో"

"నీపెళ్లి కన్నా నాకు టి.వి. సినిమా ఏమీ ఎక్కువ కాదు" మూతి ముడుచుకొని చెప్పిందావిడ.

శనివారం మధ్యాహ్నం సునీతి ఆటోదిగింది. చేతిలో నాలుగైదు వంటల పుస్తకాలూ, కూరల సంచీ ఉన్నాయి. అంతవరకూ కూతురు మనసు మార్చుకుంటుందేమోనన్న ఆశ అణగారిపోయింది. "అబ్బాయి చాలా యోగ్యుడు, బుద్ధిమంతుడూను, అన్ని విధాలా అనుకూలమైన సంబంధం. అమ్మాయికి మరోసారి చెప్పిచూద్దాం" అనుకుని కూతురు వెనుకే వంటింట్లోకి వెళ్లిందావిడ. ఆవిడ చెప్పేలోగానే సునీతి "అమ్మా నువ్వు చెప్పబోయేది నాకు తెలుసు. నా నిర్ణయం మారదు." అంది. "ఏం వండుతున్నావ్" అందావిడ నిస్పృహగా.

"పులిహోర, చక్రపొంగలి, కేరెట్ కూర, దొండకాయ వేపుడు, సాంబారు, చారు, కొబ్బరికాయ పచ్చడి, అప్పడాలు, వడియాలు" హోటలు వెయిటర్‌లా లిస్టు చదివింది సునీతి.

"పోనీ నేను పక్కనే ఉంటాను. ఏదైనా నీకు చిన్న చిన్న సాయాలు చేస్తాను."

"అలాగని మొత్తం చేద్దామనా. ఏం కుదరదు. నువ్వెళ్లి హాల్లో పడుకో".

పద్మావతమ్మగారికి హాల్లో నిద్రపట్టడం లేదు. వంటింట్లో నుంచి కుక్కర్ విజిల్స్ మిక్సీ చప్పుళ్లు, గ్యాస్ వెలిగించడం, ఆపడం అన్నీ తెలుస్తున్నాయి. ఎక్కడా వంట ఘుమ ఘుమ తెలియడం లేదు. ఏదో మాడు వాసన పచ్చి ఉల్లిపాయలు ఉడుకుతున్న వాసన. ఆమె గుండె వేగంగా కొట్టుకున్న చప్పుడులో మిగతా శబ్దాలు వినబడడం మానేశాయి. కెవ్వుమన్న కేకకు వంటింట్లోకి పరిగెత్తిందావిడ.

"అప్పడాలు వేయిస్తుంటే నూనెమీద చిందిందంతే కంగారు పడకు. వంట అయిపోయిందిలే. ఇంక టేబులు మీద సర్దేస్తాను"

"భగవంతుడా ఇదికూడానా. కాలిన మచ్చ కనిపించకుండా కాస్త పౌడర్ రాసుకో"

టేబులుమీద అన్నీ సర్ది సునీతి స్నానం చేసి అలంకరించుకొంది. ఎంత ప్రయత్నించినా కాలిన మచ్చ పోలేదు. కూతుర్ని చూసిన తల్లి ఎంతో మురిసిపోయింది.

ఈ సంబంధం కుదిరితే బాగుండును. అబ్బాయి ఎక్కడైనా డిన్నర్ ఎంగేజ్‌మెంట్ ఉంది అంటే బాగుండును. అప్పుడు సునీతి తప్పక నచ్చుతుంది. అమ్మాయికి చదువా, అందమా, ఉద్యోగమా ఏం తక్కువ. సంపాదిస్తోంది ఓ వంటలక్కని పెట్టుకుంటుంది. చంద్రుడిలో చిన్నమచ్చ. స్వామీ ఈ సంబంధం కుదిరేలా చెయ్యి". ఆ కన్న తల్లి మనస్సు తల్లడిల్లిపోయింది.

సాయంత్రం అయిదున్నర దాటేసరికి రామారావుగారు పెళ్లికొడుకు సతీష్‌తో సహా వచ్చారు.

"మా ఆవిడ పద్మావతి. మా అమ్మాయి సునీతి. ఎమ్.కామ్. యూనివర్సిటీ ఫస్టు. ఆంధ్రాబ్యాంకులో ఆఫీసరు' పరిచయాలు పూర్తయ్యాయి.

"ఏం తీసుకుంటారు. కాఫీయా, టీయా" వంటెలాగూ బాగులేదు. కనీసం తన చేత్తోకాఫీ అయినా మంచిది చేసి ఇస్తే అబ్బాయికి కాస్త మంచి అభిప్రాయం ఏర్పడుతుందేమోనని ఆశగా అడిగిందావిడ.

"వేసవి కాలంకదా. చల్లగా ఏమిచ్చినా సరే."

నిరాశగా చూసింది పద్మావతమ్మగారు. సునీతి లేచి వెళ్లి ఫ్రిజ్‌లోనుంచి లిమ్కాలు తెచ్చి ఇచ్చింది. సంభాషణ సామాన్యమైన విషయాలమీద సాగింది.

"మీరు వంటలో డిప్లమా చేశారెందుకు?" రామారావుగారడిగేరు.

"నేను డిగ్రీ పూర్తిచేసిన కొత్తలో మూడేళ్లు బొంబాయిలో ఉద్యోగం చేశాను. సాయంత్రాలు కాలక్షేపం ఉండేదికాదు. ఏ క్లబ్‌లోనో మెంబరై తాగుడుతో పేకాటలో కాలం గడపడం ఒకపద్ధతి. ఏదైనా కొత్త సబ్జెక్ట్ చదవటం ఒక పద్ధతి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ నేర్చుకొన్నాను. అకౌంటెన్సీ నేర్చుకొన్నాను. ఇంకేంచేయాలి. అనుకుంటూ ఉంటే కుకరీ క్లాసెస్ ప్రకటన కనపడింది. ఆడవాళ్లు మగవాళ్ల పనుకున్న అన్ని రంగాలలోనూ ప్రతిభ కనపరుస్తూ ఉంటే మగవాళ్లెందుకు ఆడవాళ్ల విద్యలు నేర్చుకోరాదు అనుకున్నాను అంతే".

"అబ్బాయి చాలా బుద్ధిమంతుడు" అనుకున్నారందరూ. సునీతి చిరునవ్వుతో అంది. "మధ్యలో మానేసేరేమో కాని పూర్వం వంట మగవాళ్లే చేసేవారు. నలభీమపాకం అంటారు కదా".

"అరె మర్చిపోయాను. మా అమ్మగారు మీకిమ్మన్నారు. మా ఊరి స్వీట్స్" అంటూ కిలో పుల్లారెడ్డి స్వీట్ల పాకెట్టు టీపాయిమీద పెట్టేడతను. మొహమాటపడుతూనే తీసుకున్నారు.

"ఇది వరకందరూ వచ్చి తిని పేర్లు పెట్టిపోయినవాళ్లే. చాలా సంస్కారవంతుల్లా ఉన్నారు. కుదిరితే బాగుండును ఈ సంబంధం" మళ్లీ అనుకుంది పద్మావతమ్మగారు.

"నేనిప్పుడే వస్తాను" అంటూ రామారావుగారు లేచి లోపలికి వెళ్లేరు. "టి.వి. చూస్తారా" అంది పద్మావతమ్మగారు. అతని మొహంలో అయిష్టతను గమనించి "రండి బాల్కనీలో కూచుని మాట్లాడుకుందాం" అంది సునీతి.

ఆమె ఆఫీసుని గురించిన వివరాలడిగేడు. వాళ్లకంపెనీ విషయాలెన్నో చెప్పేడు. సాహిత్యం, క్రీడారంగం సంగీతంలో అభిరుచులూ ఇంకా ఎన్నో విషయాలు వాళ్ల మధ్య దొర్లేయి. మధ్యలో ఏడున్నర కావస్తుంటే "న్యూస్ చూస్తారా" అని అడిగింది సునీతి. "నాకు పాలిటిక్స్ అంటే పడదండి. పేపర్ చదువుతుంటే వీళ్ళా మనని పరిపాలిస్తున్నారు అని బాధ కలుగుతుంటుంది" అన్నాడు ఇన్ని విషయాలలో ఏకాభిప్రాయమా అని ఆశ్చర్య పడింది సునీతి.

"అమ్మాయి భోంచేద్దాం" అని పిలిచేదాకా టైం తెలియలేదు సునీతికి. ఆమెకు సతీష్ ప్రవర్తన, మాట తీరు, అభిప్రాయాలు ఎంతగానో నచ్చేయి. భోజనం తలుచుకుంటుంటే భయం వేసింది. "అమ్మనే చెయ్యనివ్వవల్సిందేమో" అనుకుందొక్కసారి.

"మీరు ముగ్గురూ కూచోండి. నేను వడ్డన చేస్తాను" అంది సునీతి. "పర్వాలేదండి నాకు మొహమాటం లేదు అంతా కలిసేతిందామ"న్నాడతను. వంటలకేసి చూసిన పద్మావతమ్మగారి గుండెల్లో రైళ్లు పరిగెత్తేయి. దొండకాయలు సగం వేగలేదు. సగం మాడిపోయాయి. కొబ్బరి పచ్చడిలో కొబ్బరి, మిరపకాయలు కనిపిస్తూనే ఉన్నాయి. మిక్సీలోనైనా సరిగ్గా రుబ్బచ్చు కదా అని కూతుర్ని తిట్టుకుంది. పులిహోర ముద్దగా ఉంది. చక్రపొంగలి మాడిపోయింది. రుచుల సంగతి దేవుడికెరుక. అయినా తినబోతున్నాం కదా!

"పులిహోర కాస్త ముద్దయింది బాబు"

సునీతి సరైన బాణం వదిలింది. "వంటంతా నేనే చేశాను"

"పర్వాలేదండి మీరు తిన్నారో లేదో గాని తమిళ వైష్ణవులు ఇలా ముద్దగానే చేసుకుంటారు. మన తెలుగువాళ్లే విడిపోయేలా చేస్తారు" అతని పాకశాస్త్ర ప్రావీణ్యత తెలుస్తోంది.

సాంబారులో ఉప్పెక్కువయింది. కేరెట్ కూరలో అసలు లేదు. అతనేం మాట్లాడకుండా సాంబారు, కూర కలిపేసుకొని తినేశాడు. మాడిపోయిన అప్పడం ముక్కకూడా వదలలేదు. "వడ్డించినవేమీ వేస్టుచేయకూడదు అది నా ప్రిన్సిపుల్" అన్నాడు.

అంతవరకూ చీరతో కప్పుకున్న మచ్చ అతనికి అప్పుడు కనిపించింది. "అరే ఏమైంది చేతిమీద".

"ఇందాక అప్పడాలు వేయిస్తుంటే కాలింది"

"కాలిన వెంటనే నీళ్లలో చెయ్యి పెట్టలేకపోయారా"

"నీళ్లలో కాలినవెంటనే పెడితే బొబ్బ కడుతుందికదా."

"వెంటనే బొబ్బకడితేనే మంచిది. అప్పుడే గాయం తొందరగా తగ్గుతుంది. ఇది ఫస్ట్ ఎయిడ్‌లో మొదటి సూత్రం."

అబ్బా అన్ని విషయాలలోను ఇతనికి ప్రావీణ్యత ఉన్నట్లుంది అనుకుంది సునీతి.

"రేపే వెడుతున్నారా హైదరాబాదు". ఆశ చావక అడిగింది పద్మావతమ్మగారు.
"లేదండి రేపు మోహన్‌రావుగారింటికి వెళ్లాలి" అన్నాడతను.

"ఇంకేముంది సునందతో సంబంధం ఖాయం" అనుకుందావిడ.

❖ ❖ ❖

సోమవారం సునీతి ఒంట్లో బాగులేదంటూ ఆఫీసుకు శెలవు పెట్టింది. "అమ్మాయి అన్యమనస్కంగా ఉంది. అబ్బాయి నచ్చినట్టున్నాడు. ఇదివరకు ఏ పెళ్లిచూపుల తరువాతా అమ్మాయి ఇలా లేదు. నువ్వు ఈ విషయం ప్రస్తావించకు" అన్నారు రామారావుగారు ఆఫీసుకు వెడుతూ.

పదకొండు గంటలవేళ రామారావుగారి తమ్ముడి భార్య సుందరమ్మ వచ్చింది. "మొన్న వచ్చినప్పుడు మీ ఇంట్లో నా రుమాలు మర్చిపోయా" నంటూ, అది వట్టి మిష అని తెలుసు. కూచోమని చెప్పి విశేషాలేమిటంది పద్మావతమ్మ.

"నిన్న మా సునందను చూడ్డానికి పెళ్లికొడుకు వచ్చాడు. ఏమందం, ఏం వినయం మా అందరికీ నచ్చేడనుకో, అతనిక్కూడా సునంద నచ్చినట్టే ఉంది. మా ఇంట్లోనే భోజనం చేశాడు. వంట సునందే స్వయంగా చేసింది. పులిహోర, చక్రపొంగలి ఘుమఘుమలాడి పోయేయనుకో అబ్బాయి ఎంత మెచ్చుకున్నాడో వంటను. మాతో పాటే టి.వి.లో సినిమా మొత్తం చూశాడు. సునంద సినిమా మిస్సవదు కదా. భోంచేస్తూ వంటలో ఏవేమిటి, ఏఏపాళ్లు వేశారో అడిగాడు. సునంద కరెక్టుగా చెప్పింది. ఈ రోజుల్లో వంట వచ్చినవాళ్లచేత చేయించి మా అమ్మాయే చేసిందనేస్తున్నార్లే" ఆవిడ వాగ్ధోరణి సాగిపోతోంది.

సునీతి భావగర్భితంగా తల్లికేసి చూసింది. "నన్నే ప్రశ్నలేస్తే ఏమౌనో". అన్నట్టుంది

ఆ చూపు. పద్మావతమ్మ ఉక్రోషంగా మొహం తిప్పుకుంది. ఆవిడలో ఆశ పూర్తిగా అడుగంటిపోయింది.

❖ ❖ ❖

"వారంరోజులయింది" అనుకున్నారు రామారావుగారు. సెకండ్ శాటర్‌డే మూలాన ఆయనింట్లోనే ఉన్నారు. పోస్ట్ అంటూ కేక వినపడింది. గుమ్మంలో కవర్‌తీసి చూశారు. హైదరాబాద్ ముద్ర. ఇంతలో తల్లీ కూతురూ కూడా వచ్చారు. అందరి మొహాల్లోనూ ఆత్రుత. ఉత్తరం విప్పి చదివేరు.

రామారావుగారికి,

ఉభయకుశలోపరి మీ అమ్మాయి రూపం ప్రవర్తన, మాటతీరు అన్నీ మా అబ్బాయికి నచ్చేయి. మీ ఇంట్లో మీరు ఇచ్చిన ఆతిథ్యానికి వాడెంతో సంతోషించాడు. మీ అమ్మాయినే ఎంపిక చేసుకున్నాడు. "అమ్మాయికి వంటరాదంటున్నావుకదా" అని వాళ్లమ్మ అడిగితే "నాకు వచ్చు కదా" అన్నాడు. అబ్బాయి స్వాతంత్ర్యానికి మేమెప్పుడూ అడ్డురాము. అందుకని మీ సంబంధం మా కందరికీ నచ్చినట్లే. మీ వీలును బట్టి ముహూర్తాలు నిర్ణయించుకుందాం. వీలు చేసుకుని ఇక్కడకు రండి.

సునీతి మొహం ఆనందంతో కళకళలాడిపోయింది. ఆమెలో తన మార్గం రైటన్న విజయోత్సాహం కూడా ఉంది.

❖ ❖ ❖

పెళ్లయ్యాక సతీష్, సునీతి హోటల్లో కూర్చుని తింటున్నారు. తింటున్న నవరతన్ కర్రీ ఎలా చెయ్యాలో వివరిస్తున్నాడతను. సునీతి విసుగ్గా అంది. "అయ్యో పెళ్లయిన కొత్తలో అందమైన పెళ్లాంతో మాట్లాడ్డానికింకేం లేవా"

"ఇది హోటలు ఇంకేమైనా మాట్లాడితే అది మాటలతో ఆగకపోవచ్చు. చేతల్లోకి పోతే కష్టం కదా". ఆమె నడుముచుట్టూ చెయ్యి వేస్తూ అన్నాడతను.

"అవును వంటంటే ఇంత ఇంటరెస్ట్ ఉన్న మీరు ఏమాత్రం వంటరాని నన్నెలా చేసుకున్నారు?"

"సరదాగా చెప్పనా? సీరియస్‌గా చెప్పనా?"

"సీరియస్‌గానే చెప్పండి. సునంద చాలా బాగా వంట చేస్తుంది. సునందను కాదని నన్నెలా చేసుకున్నారు".

"దీనికి ముందు మా కంపెనీ మేనేజింగ్ డైరెక్టరుగారు ఒక మీటింగులో అన్న మాటలు చెప్తాను. "మనం ఉద్యోగుల రిక్రూట్‌మెంటుకి పరీక్షలు పెడతాం. ఇంటర్వ్యూలు చేస్తాం. ఇవన్నీ అభ్యర్థికి పనివచ్చు అతను పనిచేయగలడు అని మాత్రమే చెప్తాయి. చేరేక అతను పనిచేస్తాడు అన్నదానికి ఈ టెస్టులు పనిచేయవు" అన్నారాయన. అలాగే మీ పిన్నిగారింట్లో సునందగారు బాగా వంటచేయగలరు అని తెలిసింది. కానీ నేను వెళ్లిన వెంటనే టి.వి. సినిమా పెట్టేరు. మధ్యలో ఒకరికీ నా సంగతి పట్టలేదు. పెళ్లిచూపులనాడే ఇలా ఉంటే ఈవిడ పెళ్లయ్యాక అసలు నన్ను పట్టించుకుంటుందా అనిపించింది. మామూలు అతిథులకైనా మర్యాద ఇంకాస్త చెయ్యాలికదా. నాకసలు చూడాలని ఉందా అని కూడా అడగలేదు. ఇక నువ్వు, మీ అమ్మ గారు, నాన్నగారు నన్నెంతగా చూసుకున్నారు. మీ ఇంట్లో కాలం తొందరగా గడిచిపోయింది. అందుకే నిన్నెన్నుకున్నాను"

"అర్థమైంది లెక్చర్‌చాలు ఇక సరదా ఆన్సర్ చెప్పండి"

"అమ్మాయ్ నేను మగవాణ్ణి నా భార్య కన్నా ఆధిక్యత ఉండాలి అని ఉంటుంది నాకు. చదువులో, ఉద్యోగంలో, జీతంలో అన్నిటిలోనూ నువ్వునాకు సమానమైతే ఇంక నా ఆధిక్యత ఎక్కడ చూపించుకోను. ఇప్పుడైతే మా ఆవిడకు వంటరాదు. నేనే నేర్పించాను అని గొప్పలు కొట్టుకోవచ్చు".

సునీతి బుంగమూతి పెట్టింది.

"అరే కోపమొచ్చిందా? పెళ్లంటే వంట కాదు అది నూరేళ్ల పంట. భర్త మీద ప్రేమున్న ఏ ఆడదైనా క్షణాలమీద వంట నేర్చుకొని అతనికి చక్కగా వండిపెడుతుంది. సంసారానికి ముఖ్యం ప్రేమ. ఇంకా చెప్పాలంటే..." ఆమె చెవిదగ్గర గుసగుసలాడేడు.

"ఓయ్ ఇది హోటలు"

"అయితే పద ఇంటికిపోదాం"

(విపుల మంత్రి)